http://www.agnidharanews.com

# అగ్నిధార

గురువారం 16 జూలై 2026

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## ప్రాథమిక నివేదికలో కీలక అంశాలు



- రామమందిర విరాళాల వ్యవహారం
- 24-48 గంటల్లో యూపీ ప్రభుత్వానికి సిట్ తుది నివేదిక!
- ముగింపు దశకు రామమందిర విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై సిట్ దర్యాప్తు
- 70 అనుమానాస్పద ఘటనలు సీసీటీవీలో గుర్తించినట్లు ప్రాథమిక నివేదిక వెల్లడి
- దర్యాప్తు కోరిన పిటిషన్లపై కేంద్రం, యూపీ ప్రభుత్వం, ట్రస్ట్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

## పార్లమెంట్‌లో స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులకు నో



- ఎంపీలకు లోక్‌సభ సచివాలయం సూచనలు
- వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం బులెటిన్ విడుదల
- భద్రత, వ్యక్తిగత గోప్యత దృష్ట్యా స్మార్ట్ పరికరాలు ధరించవద్దని సూచన
- పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, ప్లకార్డులు, ఏఐ పోస్టర్ల ప్రదర్శనకూ నిషేధం



### కాళేశ్వరానికి ఓనర్ రాష్ట్రమే..
## కేంద్రం కాదు

- గురువు కోసమే రేవంత్ నీళ్లు వదిలేస్తున్నడు..
- కాళేశ్వరం నింపకపోవడం రేవంత్ నేరపూరిత చర్య
- ఎన్‌డీఎస్‌ఏను అడ్డుపెట్టుకొని సీఎం డ్రామాలు
- మేడిగడ్డ వద్ద కాఫర్‌డ్యామ్ కట్టి నీళ్లివ్వాలి
- ఇంజినీర్ల రిపోర్టును ఎందుకు దాచారు?
- నీళ్లిస్తే కేసీఆర్‌కు పేరొస్తుందనే అసూయ
- రైతులు రక్తం ఇస్తున్నా కాంగ్రెస్‌కు పట్టదా?
- సర్వేల ఫలితాలు చూశాకే రేవంత్‌లో గాభరా
- సీఎంతో నా పోరాటం.. రాష్ట్ర ప్రజల కోసమే
- అడ్డగోలు మాటలపై రాహుల్ ఏం చేస్తున్నరు?
- వచ్చే ఏడాది రాష్ట్రంలో పాదయాత్ర చేస్తా
- ఢిల్లీలో చిట్‌చాట్‌లో కేటీఆర్

హైదరాబాద్

కాళేశ్వరంలో నీళ్లు నింపకపోవడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా చేస్తున్న నేరపూరిత చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎల్ నినో లాంటి తీవ్ర కరువు పరిస్థితుల్లోనూ ఏపీ రైతులకు అక్కడి ప్రభుత్వం ఎంతో బాగా కాపాడుకొంటుంటే.. రేవంత్‌రెడ్డి ఎన్డీఎస్ఏను - మిగతా3లో

## అమెజాన్‌తో ఫ్యూచర్

- ఫార్చ్యూన్--500 కంపెనీలను ఆకర్షించడానికి దోహదపడుతుంది
- అమెజాన్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఈ సంస్థ తన కార్యకలాపాలను మరింత విస్తరించాలి..
- రూ.60 వేల కోట్లు కాదు రూ. లక్ష కోట్ల పెట్టుబడి పెట్టాలి
- ఈస్థాయి పెట్టుబడులు వస్తేనే 2034కి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యం
- పరిశ్రమలకు అవసరమైన వసతుల ఏర్పాటుకు, అనుమతులివ్వడానికి సిద్ధం
- ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్ల కోసం భూములు త్యాగం చేసిన రైతులను గుర్తుంచుకుంటామన్న సీఎం
- రైతు కుటుంబాలకు నష్ట పరిహారం, ఉపాధి అవకాశాలు ఇవ్వాలని ఆదేశం



హైదరాబాద్

రాష్ట్రంలో అమెజాన్ లాంటి సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం ఫ్యూచర్ సిటీలో ఇతర కంపెనీలు, పరిశ్రమల ఏర్పాటుకు దోహద పడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఫార్చ్యూన్--500 కంపెనీలను ఆకర్షించడానికి ప్రధాన పరిశ్రమగా అమెజాన్ దోహదపడుతుందని అన్నారు. ఈ సంస్థ తన కార్యకలాపాలను మరింతగా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో మిగతా3లో

## చైనాతో పోటీ

- విద్యార్థులు క్రీడల్లో రాణించాలి
- మీ భవిష్యత్తుకు నాదీ హామీ
- గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్న సీఎం రేవంత్ రెడ్డి
- విద్యార్థులకు తెలంగాణ విద్యా కిట్ అందించనున్నామని వెల్లడి
- ప్రభుత్వ పాఠశాలపై ప్రత్యేకమైన దృష్టి పెట్టామన్న సీఎం



హైదరాబాద్

గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడం కారణంగానే విద్యార్థులు చేరలేదని, అధికశాతం మంది ప్రైవేటు స్కూళ్ల వైపు మళ్లారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కారు బడులపై ప్రత్యేక దృష్టిసారించామని, ఉపాధ్యాయుల సిబ్బంది సమస్యలు పరిష్కరించామని సీఎం తెలిపారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల హైస్కూల్‌కు - మిగతా3లో



### తెలంగాణలో
## ఎస్ఐఆర్ గడువు పెంపు

- ఎన్నికల సంఘం ప్రకటన
- తెలంగాణ ఓటరు జాబితా సవరణ షెడ్యూల్‌లో మార్పులు
- బీఎల్వోలు ఇంటింటి సర్వే ఆగస్టు 3 వరకు నిర్వహణ
- అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా విడుదల

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు పది రోజులు పొడిగించారు. ఈ నెల 24న పూర్తి కావల్సిన ఎన్యుమరేషన్ ప్రక్రియను ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంది. ముసాయిదా జాబితా ఆగస్టు 10న పబ్లిష్ కానుంది. - మిగతా3లో

### అమెరికాలో ట్రంప్ చిత్రంతో
## కొత్త డాలర్ నాణెం




- అమెరికా 250వ స్వాతంత్ర్య వార్షికోత్సవం సందర్భంగా కొత్త నాణెం
- ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో 1 డాలర్ నాణెం విడుదల
- దేశభక్తికి, స్వేచ్ఛకు ప్రతీకగా ఈ నాణెం అని తెలిపిన ట్రెజరీ విభాగం



## దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రక్షాళన

- ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఈసీ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్
- నకిలీ, వలస వెళ్లిన ఓటర్లను తొలగించి, అర్హులను చేర్చడమే లక్ష్యం
- ఇప్పటికే ముగిసిన రెండు దశలు
- ఏపీ, తెలంగాణ సహా 16 రాష్ట్రాల్లో మూడో దశ సర్వే
- ఏపీలో ఇంటింటి సర్వే గడువు జూలై 24 వరకు పొడిగింపు




## మీ బ్యాంకు లావాదేవీలపై ఐటీ నిఘా

- ఈ పొరపాట్లు చేస్తే నోటీసులు ఖాయం!
- సేవింగ్స్ ఖాతాలో రూ.10 లక్షలు దాటిన నగదు డిపాజిట్లపై ఐటీ శాఖ దృష్టి
- క్రెడిట్ కార్డు బిల్లులకు రూ.10 లక్షలు దాటిన చెల్లింపులపై నిఘా
- రూ.30 లక్షలు దాటిన ఆస్తి కొనుగోలు, అమ్మకాలపై సమీక్ష
- లావాదేవీలకు, ఐటీఆర్‌కు పొంతన లేకపోతే భారీ జరిమానా ప్రమాదం

# ప్రాథమిక నివేదికలో కీలక అంశాలు



అయోధ్య రామమందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరో 24 నుంచి 48 గంటల్లో ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వానికి తన తుది నివేదికను సమర్పించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆ నివేదిక గురువారం లేదా శుక్రవారం ప్రభుత్వానికి అందే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఇదే సమయంలో సిట్ దర్యాప్తు గడువును ఇకపై పొడిగించే అవకాశం లేదని కూడా తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తును మరింత విస్తృతంగా చేపట్టేందుకు ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వం జూలై 1న సిట్‌కు 15 రోజుల గడువు పొడిగించింది. విరాళాల లెక్కింపు ప్రక్రియ, భద్రతా ఏర్పాట్లు, నగదు నిర్వహణ, సంబంధిత సిబ్బంది పాత్ర వంటి అన్ని అంశాలపై సమగ్రంగా విచారణ జరిపిన అనంతరం తుది నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం.

సిట్ ఇప్పటికే సమర్పించిన ప్రాథమిక నివేదికలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 2026 మధ్య కాలంలో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా సుమారు 70 అనుమానాస్పద ఘటనలు గుర్తించినట్లు నివేదిక పేర్కొంది. నగదు లెక్కింపు బాధ్యతలు నిర్వహిస్తున్న కొందరు సిబ్బంది నగదు కట్టలను దాచిపెడుతున్న దృశ్యాలు సీసీటీవీలో నమోదైనట్లు అందులో ప్రస్తావించింది. అలాగే విరాళాల దుర్వినియోగానికి దారితీసిన పలు లోపాలను కూడా సిట్ గుర్తించింది. నగదు లెక్కింపు కేంద్రంలోకి ప్రవేశించే సమయంలో, బయటకు వెళ్లే సమయంలో సిబ్బందిని తనిఖీ చేయకపోవడం, వ్యక్తిగత వస్తువులపై సరైన నియంత్రణ లేకపోవడం, వేర్వేరు హుండీల నుంచి వచ్చిన నగదును ఒకేసారి కలిపి లెక్కించడం వంటి అంశాలు ఈ ఘటనకు అవకాశం కల్పించినట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

**నగదు స్వాధీనం**

దర్యాప్తు ప్రారంభానికి ముందే కొందరు ఉద్యోగుల వద్ద నుంచి రూ.78.94 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు నివేదిక వెల్లడించింది. అంతేకాకుండా జూన్ 4న నగదు లెక్కింపు గదికి ఆనుకుని ఉన్న బాత్‌రూమ్‌లో మరో రూ.2.25 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సిట్ తెలిపింది. అయితే సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన వెండి ఇటుకలు, ఇతర విలువైన కానుకలు కనిపించకుండా పోయాయన్న ఆరోపణలకు ఇప్పటివరకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లభించలేదని కూడా సిట్ తన నివేదికలో స్పష్టం చేసింది.

**ఎనిమిది మంది నిందితులకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు**

ఈ కేసులో అరెస్టయిన ఎనిమిది మంది నిందితుల జ్యుడీషియల్ కస్టడీని అయోధ్య కోర్టు మరో 14 రోజుల పాటు పొడిగించింది. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిందితులను కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ నెల 27న వారిని మరోసారి కోర్టు ఎదుట హాజరుపరచనున్నారు. రామజన్మభూమి ఆలయంలో విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై స్వతంత్రంగా, న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఇటీవల విచారణకు స్వీకరించింది.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌కు నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ తన దర్యాప్తు పురోగతిపై స్థితిగతుల నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అలాగే సిట్‌లో ఉన్న సభ్యుల వివరాలను కూడా అందించాలని సూచించింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

**ట్రస్ట్‌లో రాజీనామాలు**

విరాళాల దుర్వినియోగ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ట్రస్ట్ అప్పటి ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌తో పాటు ట్రస్ట్ సభ్యులు అనిల్ మిశ్రా, గోపాల్ రావు రాజీనామాలు చేశారు. ట్రస్ట్ వారి రాజీనామాలను ఆమోదించింది. ఇప్పుడు సిట్ తుది నివేదికపై అందరి దృష్టి నెలకొంది. ఈ నివేదిక ఆధారంగా ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు సుప్రీంకోర్టు విచారణ, సిట్ నివేదిక, కోర్టులో కొనసాగుతున్న కేసు పరిణామాలు ఈ వ్యవహారంలో కీలకంగా మారనున్నాయి.

# మీ బ్యాంకు లావాదేవీలపై ఐటీ నిఘా..




వేతన జీవులు సైతం తమ సాధారణ బ్యాంకింగ్ లావాదేవీల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ హెచ్చరిస్తోంది. అధిక విలువ కలిగిన కొన్ని రకాల లావాదేవీలు ఆటోమేటిక్ వ్యవస్థల ద్వారా నేరుగా ఐటీ శాఖ దృష్టికి వెళతాయని, ఫలితంగా నోటీసులు వచ్చే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా ఈ పర్యవేక్షణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.

ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 285దీూ ప్రకారం, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు నిర్దేశిత ఆర్థిక లావాదేవీల వివరాలను తప్పనిసరిగా ఐటీ శాఖకు నివేదించాల్సి ఉంటుంది. ఈ సమాచారం పన్ను చెల్లింపుదారుల వార్షిక సమాచార నివేదిక (ూ×ూ) మరియు ఫామ్ 26ూూలో ప్రతిబింబిస్తుంది. దాఖలు చేసిన ఐటీ రిటర్న్స్‌తో ఈ వివరాలు సరిపోలకపోతే, పన్ను ఎగవేత ఉద్దేశం లేకపోయినప్పటికీ ఐటీ శాఖ నుంచి నోటీసులు వచ్చే అవకాశం ఉంది.

**ఐటీ శాఖ నిఘాలో ఉన్న ప్రధాన లావాదేవీలు**

నగదు డిపాజిట్లు: ఒక ఆర్థిక సంవత్సరంలో సేవింగ్స్ ఖాతాలో రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు జమ చేసినట్లయితే, ఆ వివరాలు ఐటీ శాఖకు చేరతాయి. వేర్వేరు సందర్భాల్లో డిపాజిట్ చేసినప్పటికీ, బ్యాంకింగ్ వ్యవస్థలు వాటన్నింటినీ కలిపి లెక్కిస్తాయి.

**క్రెడిట్ కార్డ్ చెల్లింపులు:** క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపుల కోసం నగదు రూపంలో రూ.1 లక్ష లేదా డిజిటల్ బదిలీల ద్వారా ఏడాదికి రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేసినా నిఘా ఉంటుంది. ప్రకటించిన ఆదాయానికి, చేసే ఖర్చులకు పొంతన లేకపోతే ఐటీ శాఖ నుంచి ప్రశ్నలు ఎదుర్కోవాల్సి రావొచ్చు.

**ఆస్తి లావాదేవీలు:** రూ.30 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ విలువైన స్థిరాస్తుల కొనుగోలు లేదా విక్రయ లావాదేవీలను ఆదాయపు పన్ను శాఖ నిశితంగా పరిశీలిస్తుంది.

**నిరుపయోగ ఖాతాలు:** సుదీర్ఘ కాలంగా వాడకంలో లేని ఖాతాలో అకస్మాత్తుగా పెద్ద మొత్తంలో నగదు జమ అయినా లేదా విత్‌డ్రా చేసినా అది ఐటీ శాఖ దృష్టికి వెళుతుంది.

**విదేశీ లావాదేవీలు:** ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు దాటిన విదేశీ కరెన్సీ కొనుగోళ్లు, ఇతర అంతర్జాతీయ లావాదేవీలను కూడా అధికారులు నిశితంగా గమనిస్తారు.

ఆర్థిక పారదర్శకతను పెంచడం, పన్ను ఎగవేతలను అరికట్టడమే లక్ష్యంగా ఈ నిబంధనలను కఠినతరం చేశారు. ఆస్తి దస్తావేజులు, రుణాలు, గిఫ్ట్ డీడ్‌లు వంటి సరైన పత్రాలు ఉన్న లావాదేవీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఐటీ నోటీసులకు స్పందించకపోయినా లేదా లెక్కలు సరిగా చూపలేకపోయినా చెల్లించాల్సిన పన్నుపై 50 శాతం నుంచి 200 శాతం వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. కాబట్టి, పన్ను చెల్లింపుదారులు జూలై 31 లోపు ఐటీఆర్ దాఖలు చేసే ముందు తమ ూ×ూను సమీక్షించుకుని, అన్ని ఆదాయ వనరులను కచ్చితంగా వెల్లడించడం ఉత్తమం.

# కర్ణాటకలో కేబినెట్ విస్తరణకు కౌంట్‌డౌన్!

కర్ణాటక రాజకీయాల్లో కేబినెట్ విస్తరణ అంశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దిల్లీ పర్యటనతో రాష్ట్ర కాంగ్రెస్‌లో మంత్రి పదవులపై చర్చలు మళ్లీ ఊపందుకున్నాయి. చాలా కాలంగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానం త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో మంత్రి పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న ఎమ్మెల్యేల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. బుధవారం సాయంత్రం దిల్లీకి వెళ్లిన డీకే శివకుమార్, కేంద్ర మంత్రులతో భేటీ అవుతారని అధికారిక షెడ్యూల్‌లో పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం ఆయన పార్టీ అగ్రనేతలతో కూడా సమావేశమయ్యే అవకాశముంది. ఇటీవలే కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నట్లు శివకుమార్ వెల్లడించారు. అధిష్ఠానం సమయం ఇచ్చిన వెంటనే దిల్లీకి వెళ్తానని ఆయన పేర్కొన్నారు. దిల్లీ పర్యటనకు ముందు డీకే శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఆయన నివాసంలో కలిసి చర్చలు జరపడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను శివకుమార్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. కేబినెట్ విస్తరణకు సంబంధించిన అంశాలపైనే ఇద్దరు నేతల మధ్య చర్చలు జరిగాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

**భారీ సంఖ్యలో ఖాళీలు**

ఇదే సమయంలో సిద్ధరామయ్య కూడా దిల్లీకి వెళ్లనున్నట్లు ఆయన కుమారుడు, రాష్ట్ర మంత్రి యతీంద్ర సిద్ధరామయ్య వెల్లడించారు. కేబినెట్ విస్తరణను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పార్టీ భావిస్తోందన్నారు. రాజ్యసభ, శాసన మండలి ఎన్నికల కారణంగా ఈ ప్రక్రియ ఆలస్యమైందని చెప్పారు. ఇప్పుడు హైకమాండ్ రాష్ట్ర నాయకులను చర్చలకు పిలిచిందని, సమావేశాల అనంతరం మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం వెలువడే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం కర్ణాటక మంత్రివర్గంలో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నాయి. డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 13 మంది మంత్రులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో మంత్రివర్గ గరిష్ఠ బలం ముఖ్యమంత్రితో కలిపి 34 మంది వరకు ఉండొచ్చు. అంటే ప్రస్తుతం ఇంకా 20 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ కారణంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది. మంత్రి పదవుల కోసం రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది ఎమ్మెల్యేలు, వారి అనుచరులు, సామాజిక వర్గాల ప్రతినిధులు లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మద్దతుదారులు బహిరంగంగా ఆందోళనలు కూడా నిర్వహించారు. బళ్లారిలో కమ్లి ఎమ్మెల్యే జేఎన్ గణేశ్‌కు మంత్రి పదవి ఇవ్వాలని మద్దతుదారులు ర్యాలీలు నిర్వహించిన ఘటన కూడా ఇటీవల చర్చనీయాంశమైంది. అయితే ఇలాంటి ఒత్తిళ్లను కాంగ్రెస్ హైకమాండ్ సీరియస్‌గా తీసుకుంది. జూన్ 24న ఎమ్మెల్యేలు, మఠాధిపతులు, సామాజిక వర్గాల నాయకులు మంత్రి పదవుల కోసం బహిరంగ లాబీయింగ్ చేయవద్దని స్పష్టమైన హెచ్చరిక జారీ చేసింది. నిర్ణయాలు ఒత్తిళ్ల ఆధారంగా కాకుండా పార్టీ అవసరాలు, ప్రాంతీయ సమతుల్యత, సామాజిక ప్రాతినిధ్యం, ప్రజా పనితీరు వంటి అంశాల ఆధారంగానే ఉంటాయని కాంగ్రెస్ నాయకత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కేబినెట్ విస్తరణ కాంగ్రెస్‌కు సవాలుగా మారింది. ఖాళీలు ఎక్కువగా ఉన్నప్పటికీ ఆశావహుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. అందరికీ అవకాశం కల్పించడం సాధ్యం కాకపోవడంతో అసంతృప్తిని ఎలా నియంత్రిస్తారన్నది పార్టీకి పెద్ద పరీక్షగా మారింది. ముఖ్యంగా లింగాయత, వొక్కలిగ, దళిత, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉంది. అలాగే ఉత్తర కర్ణాటక, దక్షిణ కర్ణాటక ప్రాంతాల మధ్య సమతుల్యత కూడా పాటించాల్సి ఉంటుంది. ఇక బీకే హరిప్రసాద్ వంటి సీనియర్ నేతలకు మంత్రి పదవులు దక్కే అవకాశాలపై కూడా చర్చ జరుగుతోంది.

## పార్లమెంట్‌లో స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులకు నో



జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు జరగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం సభ్యులకు పలు కీలక సూచనలు చేసింది. సమావేశాల సమయంలో భద్రతతో పాటు సభ్యుల వ్యక్తిగత గోప్యతను దృష్టిలో ఉంచుకుని స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులు, పెన్ కెమెరాలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించవద్దని కోరింది. దేశంలో ప్రస్తుతం సులభంగా అందుబాటులో ఉన్న ఈ స్మార్ట్ పరికరాలను రహస్యంగా చిత్రాలు, వీడియోలు తీయడానికి లేదా ఇతరుల గోప్యతకు భంగం కలిగించే విధంగా ఉపయోగించే అవకాశం ఉందని లోక్‌సభ సచివాలయం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎంపీలు అలాంటి పరికరాలకు దూరంగా ఉండాలని బులెటిన్‌లో విజ్ఞప్తి చేసింది. అలాగే పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, నిరసనలు, ప్లకార్డుల ప్రదర్శన, ఆయుధాల ప్రదర్శన, మతపరమైన కార్యక్రమాల నిర్వహణ వంటి చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ఏఐ సాయంతో రూపొందించిన చిత్రాలు, పోస్టర్లు, అవమానకర నినాదాలతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లను కూడా ప్రదర్శించరాదని పేర్కొంది. సమావేశాల సమయంలో ఇతర సభ్యులు తమ ఛాంబర్లకు సులభంగా వెళ్లేలా పార్లమెంట్ ప్రవేశద్వారాల వద్ద ఎలాంటి ఆందోళనలు, ప్రదర్శనలు నిర్వహించవద్దని ఎంపీలకు సూచించింది. గత బడ్జెట్ సమావేశాల సమయంలో సస్పెన్షన్‌కు గురైన కొందరు ఎంపీలు పార్లమెంట్ గేటు వద్ద నిరసనలు చేపట్టిన నేపథ్యంలో ఆ మార్గదర్శకాలను మరోసారి గుర్తు చేసింది. పార్లమెంట్ కార్యకలాపాలు ప్రశాంతంగా, అంతరాయం లేకుండా సాగేందుకు సభ్యులంతా నిబంధనలు పాటించాలని లోక్‌సభ సచివాలయం కోరింది.

## అమెరికాలో ట్రంప్ చిత్రంతో కొత్త డాలర్ నాణెం




అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం 250వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో కొత్త ఒక డాలర్ (వ1) నాణేన్ని ముద్రించనున్నట్లు యునైటెడ్ స్టేట్స్ మింట్ ప్రకటించింది. ఈ విషయాన్ని ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ బుధవారం వెల్లడించారు. ఈ నాణేనికి ఒకవైపు ట్రంప్ చిత్రం ఉండగా, దానిపై "లిబర్టీ", దిగువన "1776-2026" అనే సంవత్సరాలను ముద్రించారు. చిత్రానికి పక్కన "ఇన్ గాడ్ వుయ్ ట్రస్ట్" అని వాక్యం ఉంటుంది. నాణేనికి రెండో వైపు రెక్కలు విప్పిన గద్ద, దాని మధ్యలో 250వ సంఖ్యతో కూడిన రక్షణ కవచం (షీల్డ్) ఉంటుంది. దానిపై "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా", "వన్ డాలర్" అనే అక్షరాలు ఉంటాయి. ఈ సందర్భంగా స్కాట్ బెస్సెంట్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, "అమెరికా 250 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల వేళ, స్వేచ్ఛకు, దేశభక్తికి చిహ్నంగా ఈ కొత్త బంగారు నాణేన్ని యూఎస్ మింట్ ముద్రించనుంది. ట్రంప్ చిత్రంతో కూడిన ఈ నాణెం అమెరికా విలువలను, స్వేచ్ఛను పరిరక్షిస్తామన్న దేశ నిబద్ధతను చాటుతుంది" అని పేర్కొన్నారు. సాధారణంగా అమెరికాలో జీవించి ఉన్న అధ్యక్షుల చిత్రాలను కరెన్సీపై ముద్రించకూడదనే నిబంధన ఉంది. అయితే, 250వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికల కోసం చట్టంలో మినహాయింపులు ఉన్నాయని అధికారులు స్పష్టం చేశారు. గతంలో 1926లో అప్పటి అధ్యక్షుడు కాల్విన్ కూలిడ్జ్ చిత్రంతో నాణేన్ని విడుదల చేసిన ఉదాహరణను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ట్రంప్ చిత్రంతో డాలర్ నాణేన్ని ఎప్పుడు విడుదల చేస్తారు, ఎన్ని ముద్రిస్తారు అనే వివరాలను ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. కాగా, ఈ నిర్ణయంపై ప్రస్తుతం మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి.

## దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రక్షాళన

దేశంలో ఎన్నికలను మరింత పారదర్శకంగా, కచ్చితత్వంతో కూడిన ప్రక్రియగా మార్చే దిశగా భారత ఎన్నికల సంఘం ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అదే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' నకిలీ ఓట్లు, చనిపోయిన వారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించి, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా 'ప్రత్యేక ఓటరు జాబితాల సమగ్ర సవరణ' పేరిట ఈ దేశవ్యాప్త ప్రక్షాళన జరుగుతోంది. ఇప్పటికే రెండు దశల్లో విజయవంతమైన ఈ ప్రక్రియ, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో మూడో దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ూ×= అంటే ఏమిటి, అది ఎలా జరుగుతుంది, ఓటర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో సమగ్రంగా పరిశీలిద్దాం. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల జాబితాను సమూలంగా సవరించే ప్రక్రియ. బూత్ లెవల్ అధికారులు (దీూం) ప్రతి ఇంటికీ వెళ్లి, పాక్షికంగా నింపి ఉన్న ఎన్యూమరేషన్ ఫారాలను అందించి, ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరిస్తారు. దీని ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో శుద్ధి చేయడం. మరణించిన వారు, ఒకే వ్యక్తికి పలుచోట్ల ఓట్లు ఉండటం (నకిలీ ఓట్లు), శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, పౌరసత్వం లేని వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం ఈ ప్రక్రియలో కీలకం. అదే సమయంలో, అర్హత ఉండి కూడా జాబితాలో పేరు లేని వారిని చేర్చడం ద్వారా స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికల నిర్వహణకు వీలు కల్పించడం ఎన్నికల సంఘం లక్ష్యం.

2025 అక్టోబర్ 27న ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రకటించారు. అయితే, ఈ ప్రక్రియపై కొన్ని రాజకీయ పక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో విషయం సుప్రీంకోర్టుకు చేరింది. 2026 మే నెలలో సర్వోన్నత న్యాయస్థానం దీనిపై స్పష్టతనిచ్చింది. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రజాప్రాతినిధ్య చట్టానికి అనుగుణంగానే ఉందని, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల సంఘం రాజ్యాంగపరమైన బాధ్యత అని పేర్కొంటూ దాని చట్టబద్ధతను సమర్థించింది. మొదటి దశ (బీహార్): ప్రయోగాత్మకంగా తొలి దశను బీహార్‌లో 2025 జూన్-సెప్టెంబర్ మధ్య చేపట్టారు. ఈ పరిశీలన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 47 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. ఇది అక్కడి మొత్తం ఓటర్లలో దాదాపు 5-6 శాతానికి సమానం. రెండో దశ (9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలు): బీహార్ ప్రయోగం విజయవంతం కావడంతో, రెండో దశను ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా మొత్తం 9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో విస్తరించారు. ఈ దశలో సుమారు 51 కోట్ల ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 2.04 కోట్ల పేర్లు, పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షల పేర్లు జాబితా నుంచి తొలగింపునకు గురయ్యాయి. ఈ ప్రక్రియ కోసం 5.3 లక్షల మంది బీఎల్‌వోలు, 7.64 లక్షల మంది బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూాలు) పనిచేశారు.

# కాళేశ్వరానికి ఓనర్ రాష్ట్రమే.. కేంద్రం కాదు

-మొదటిపేజీ తరువాయి

అడ్డుపెట్టుకొని డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ రైతులు రక్తం ఇస్తున్నా కాంగ్రెస్ సర్కార్ వ్యవసాయానికి నీళ్లు ఇవ్వడం లేదని నిప్పులుచెరిగారు. అయితే నీళ్లు ఎత్తిపోస్తే కేసీఆర్‌కు ఎక్కడ మంచిపేరు వస్తుందనే అసూయతోనే రేవంత్‌రెడ్డి ఉన్నారని విమర్శించారు. ప్రాజెక్టు వద్ద కాఫర్ డ్యామ్ నిర్మించి కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోయాలని సూచించారు. ఢిల్లీలో బుధవారం మీడియా ప్రతినిధులతో కేటీఆర్ చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సీఎం చేయించిన నాలుగు సర్వేల్లో కూడా బీఆర్ఎస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని వెల్లడికావడంతో రేవంత్ గాబరా పడుతున్నారని చెప్పారు. రేవంత్‌తో తనకు ఎలాంటి వ్యక్తిగత విభేదాలు లేవని, ఆయన తీసుకొంటున్న నిర్ణయాల వల్లే రాష్ట్ర ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అందుకే తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డితో తన పోరాటం.. రాష్ట్ర ప్రజల కోసమేనని స్పష్టంచేశారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని, కాబోయే సీఎం కేసీఆరేనని ధీమా వ్యక్తంచేసిన కేటీఆర్.. వచ్చే ఏడాది రాష్ట్రంలో పాదయాత్ర చేయనున్నట్టు వెల్లడించారు.

### రేవంత్‌రెడ్డి రక్తపిశాచి

సీఎం రేవంత్‌రెడ్డి రక్తపిశాచిలా అడ్డగోలుగా మాట్లాడుతున్నా గాంధేయవాదులమని చెప్పుకొనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించడం లేదని, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేటీఆర్ నిలదీశారు. రక్తం పొలాల్లో చల్లాలని ఏ ముఖ్యమంత్రి అయినా చెప్తాడా? హిట్లర్ తనకు ఆదర్శమని ఏ ముఖ్యమంత్రి అయినా అంటారా? అని మండిపడ్డారు. కాళేశ్వరం విషయంలో కావాలనే రైతులకు ఇబ్బంది పెడుతున్నారని, తమపై ఉన్న కోపాన్ని ఈ ప్రభుత్వం రైతుల మీద చూపెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటివరకు 73 సార్లు ఢిల్లీకొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కనీసం 73 పైసలైనా రాష్ట్రానికి తీసుకొచ్చారా? అని ప్రశ్నించారు. ప్రస్తుత ఢిల్లీ పర్యటనలో రేవంత్‌రెడ్డి ఎన్డీఎస్‌ఏ అధికారులను ఎందుకు కలువలేదని నిలదీశారు. టీఆర్ఎస్ అనేది మా క్రెడిబిలిటీ. ఆ పేరుతో మాకు 22 ఏండ్ల సుదీర్ఘ అనుబంధం ఉన్నది. అది తెలంగాణ తెచ్చిన పార్టీ, అధికారంలోకి వచ్చిన పార్టీ, ఇప్పుడు ఇంకెవరో వచ్చి ఆ పేరును తీసుకొంటామంటే తెలంగాణ సమాజంలో ఎవరు ఒప్పుకొంటారు. ఉద్దేశపూర్వకంగా మాకు నష్టం చేయాలని ప్రయత్నం చేస్తే ఎలా ఊరుకుంటాం.

### వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తా..

వచ్చే ఏడాది తెలంగాణలో తాను స్వయంగా పాదయాత్ర చేస్తానని కేటీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ ఓటమికి చాలా కారణాలు ఉన్నాయని, వాటిపై ఆత్మవిమర్శ చేసుకుని ముందుకుపోతున్నట్టు చెప్పారు. కేసీఆర్ నెక్స్ట్ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మాదిరిగానే తెలంగాణలో బీజేపీ పరిస్థితి ఉంటుందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ సీఎం అభ్యర్థి ఎవరో కూడా రాష్ట్ర ప్రజలకు తెలియదని, ఎనిమిది మందిలో ఎవరికి వారు తామే సీఎం అని అంటున్నారని చురకలంటించారు. ఇన్నేండ్లు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండి తెలంగాణకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

### దక్షిణాది వాటా తగ్గకుంటేనే మద్దతు

దక్షిణాది సీట్ల వాటా తగ్గకుంటేనే పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇస్తామని కేటీఆర్ స్పష్టంచేశారు. డీలిమిటేషన్ బిల్లులో దక్షిణాది రాష్ట్రాల వాటా 24శాతంగానే కొనసాగాలని, యథావిధిగా దక్షిణాది వాటా ఉంటేనే బిల్లుకు మద్దతిస్తామని తేల్చిచెప్పారు. తెలంగాణలో ఎలాగైనా సీట్లు పెరుగడం ఖాయమని, అది డీలిమిటేషన్ విధానంలో అయినా, లేదంటే ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారమైనా సీట్లు పెరుగాల్సిందేనని పేర్కొన్నారు. ఏదైనా సరే బీజేపీ అనుకుంటే ఫాస్ట్ అవుతుందని, లేదంటే ఆలస్యం తప్పదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సౌత్‌కు 24శాతం సీట్లు పార్లమెంట్‌లో ఉన్నాయని, డీలిమిటేషన్ తర్వాత కూడా సౌత్ ప్రాధాన్యం అలాగే ఉండాలని, ఏమాత్రం తగ్గొద్దని డిమాండ్ చేశారు. ఒకవేళ జనాభా లెకల ప్రకారమే సీట్లు కేటాయిస్తే దక్షిణాది నష్టపోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు కుటుంబ నియంత్రణ పాటించినందుకు ఇకడ జనాభా తగ్గిందని వివరించారు.

### ఎన్డీఎస్ఏను అడ్డం పెట్టుకొని డ్రామాలు

ఎన్డీఎస్ఏను అడ్డు పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కేవలం 8.5కోట్లతో కాఫర్‌డ్యామ్ కట్టొచ్చని డ్యూటీలో ఉన్న ఇంజినీర్లు ఇచ్చిన రిపోర్టును ప్రభుత్వం బయటపెట్టకుండా దాచిపెట్టిందని ఆరోపించారు. తెలంగాణ రైతులు రక్తం ఇస్తున్నా కాంగ్రెస్ సర్కార్ వ్యవసాయానికి నీళ్లు ఇవ్వడం లేదని, ప్రభుత్వ నిర్వాకం వల్లే సూర్యాపేట వద్ద ఉన్న ఓ తండాలో రైతు తన రక్తం భూమిలో చల్లాడని ఆవేదన చెందారు. గతంలో భారీగా గోదావరి వరదలు వచ్చినప్పుడు కూడా మేడిగడ్డ, భద్రాచలం ప్రాజెక్టులకు ఎలాంటి నష్టం కలుగలేదని గుర్తుచేశారు. వర్షాకాలంలో గోదావరి ప్రవాహానికి అడ్డుకట్ట వేయడం ఎవరికీ సాధ్యంకాదని తేల్చిచెప్పారు.

ప్రస్తుతం పార్లమెంట్‌లో దక్షిణాదికి 24శాతం సీట్లున్నాయి. డీలిమిటేషన్ తర్వాత కూడా ఏమాత్రం తగ్గద్దు. దక్షిణాది వాటా యథావిధిగా ఉంటేనే పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతిస్తాం. డీలిమిటేషన్ ప్రకారమైనా, ఏపీ పునర్విభజన చట్టం ప్రకారమైనా తెలంగాణలో సీట్లు పెరుగాల్సిందే. ఒకవేళ జనాభా లెకల ప్రకారమే సీట్లు కేటాయిస్తే దక్షిణాది నష్టపోయే ప్రమాదం ఉన్నది.

### బెదిరిస్తే పారిశ్రామికవేత్తలు పారిపోరా?

రాష్ట్రంలో పారిశ్రామికవేత్తల తలలకు తుపాకులు పెట్టి బెదిరిస్తే వారు ఇకడినుంచి పారిపోరా? అని కేటీఆర్ ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం నగరాభివృద్ధి కోసం ఎయిర్‌పోర్టు మెట్రో ఏర్పాటుకు శ్రీకారం చుట్టి పనులు మొదలుపెట్టిందని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ మెట్రోను రేవంత్‌రెడ్డి రద్దు చేశారని మండిపడ్డారు. మెట్రో భూములు 280 ఎకరాలపై రేవంత్‌రెడ్డి కన్ను పడిందని, ఎలాగైనా వాటిని అమ్మేస్తారని ఆరోపించారు. ప్రైవేట్ సంస్థ అయిన ఎల్‌అండ్‌టీ చేసిన అప్పులను ప్రభుత్వం ఎందుకు కట్టాలని ఆయన ప్రశ్నించారు. లోక్‌సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేకపోవడం వల్లే ఢిల్లీలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో 15 మంది ఎంపీలతో తాము లోక్‌సభలోకి వస్తే పార్లమెంట్‌లో తమ బలం గణనీయంగా పెరుగుతుందని కేటీఆర్ స్పష్టంచేశారు.

### 4లక్షల కోట్లకుపైగా అప్పు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేండ్లలో రూ.4 లక్షల కోట్లకుపైగా అప్పులుచేసిందని కేటీఆర్ చెప్పారు. కానీ, బీఆర్ఎస్ సర్కార్ తమపై అప్పుల భారం మోపినట్టుగా అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. తాము పదేండ్లలో కేవలం రూ.4.17 లక్షల కోట్ల రుణ సమీకరణ చేశామని పునరుద్ఘాటించారు. అప్పుల కోసం నెలకు కేవలం రూ.2,300 కోట్ల వడ్డీ చెల్లిస్తున్న సర్కార్.. తాము 5-6 వేల కోట్లు చెల్లిస్తున్నట్టుగా అబద్ధాలు ఆడుతున్నదని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి అనుభవరాహిత్య పాలన వల్ల అన్ని రంగాలు సంక్షోభంలో కూరుకుపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు

# చైనాతో పోటీ

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఫర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్-2.0లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రానికి 18 స్థానం వచ్చిందన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక పెండింగ్?లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారించామన్నారు. విద్యార్థులకు తెలంగాణ విద్యా కిట్? కింద 9 వస్తువులు అందించేందుకు నిర్ణయం తీసుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. రూ.1000 కోట్లతో 27,50,000 మంది విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీలోపు ఈ కిట్?ను ఇవ్వనున్నట్లుగా వెల్లడించారు. ఒక్కో విద్యార్థి చదువు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.8లక్షలు ఖర్చు చేస్తుందని వివరించారు. ఒకప్పుడు స్టడీటూర్‌కు ఐఏఎస్‌లు వెళ్లేవారని, ఈ ఏడాది టీచర్లను స్టడీటూర్‌కు సింగపూర్, సౌత్ కొరియా లాంటి దేశాలకు పంపించామని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు.

"ఒక్కో విద్యార్థిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.1.08లక్షలు ఖర్చు చేస్తోంది. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలి. విద్యలో రాణించకపోతే క్రీడల్లో రాణించాలి. క్రీడాకారులు మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి. విద్యార్థులు మైదానాల్లోనూ పోటీపడాలి. మీ భవిష్యత్?కు నాదీ హామీ.



క్రీడల్లో రాణించేవారిని ఉన్నతస్థాయిలో నిలిపే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతాం"

### అమరరాజా యూనిట్ ప్రారంభం

అంతకుముందు మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమరరాజ సంస్థ చేపట్టిన 'సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ యూనిట్'ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి కోసం గత ప్రభుత్వాలు చేసిన పాలసీలను మరింత మెరుగుపరిచామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇండస్ట్రీ, టూరిజం, మెడికల్ పాలసీలతో రాష్ట్ర జీఎస్?డీపీ పెంచుతున్నామని పేర్కొన్నారు.

అమరరాజా సంస్థ మహబూబ్‌నగర్‌లో పెట్టడం ఆ జిల్లా ప్రజలకు గర్వకారణమని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ సంస్థతో పోటీ పడేది దేశంలో ఏదీ లేదన్నారు. చైనాతో పోటీ పడే అమరరాజా సంస్థకు సంపూర్ణంగా సహకరిస్తున్నామని వివరించారు. వికసిత్ భారత్? 2047 కల్లా 3 ట్రిలియన్ డాలర్లకు చేరడమే లక్ష్యమన్న సీఎం, అమర రాజ సంస్థ తన లక్ష్యానికి సహకరిస్తుందని వివరించారు. అమరరాజా నూతన యూనిట్? ఏర్పాటుకు రైతులు భూములు ఇచ్చారని వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. వాహన కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాలు ఉండాలని, ఈవీలకు బ్యాటరీలే కీలకమని రేవంత్ రెడ్డి తెలిపారు. కాలుష్యంలేని దేశంగా తీర్చిదిద్దాలంటే ఈవీ వాహనాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వివిధ రంగాల్లో కొత్త పాలసీలను రూపొందించామన్నారు. దేశంలో 2.5 శాతం జనాభా ఉన్న తెలంగాణ నుంచి 5 శాతం జీడీపీ అందిస్తోందన్నారు.

### పరిశ్రమలకు అనుకూల వాతావరణం సృష్టిస్తాం

కల్వకుర్తి, బీమ, నెట్టెంపాడు, పాలమూరు రంగారెడ్డి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు పూర్తి చేసుకునేందుకు, సమస్యలు పరిష్కరించుకునేందుకు పక్క రాష్ట్రాలతో చర్చలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. త్వరలోనే జిల్లా రైతులకు శుభవార్త వినిపించబోతున్నామన్నారు. 90 టీఎంసీలకు సంబంధించి కేంద్రాన్ని ఒప్పించే విధంగా ముందుకు వెళ్తున్నామన్న ఆయన, త్వరలోనే కృష్ణానది పరివాహక ప్రాంతంలో సంపూర్ణ అనుమతులు తీసుకొస్తామని చెప్పారు. పరిశ్రమలకు అనుకూల వాతావరణం సృష్టించి, పెట్టుబడులు ఆహ్వానించి జిల్లా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ

**షాబాద్ ఘటనపై రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ లేఖ**

**పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి**

**పోక్సో కేసు నిందితుడు ఆరుగురిని హత్య చేసిన వైనం**

**పోలీసుల వైఫల్యం వల్లే ఈ ఘోరం జరిగిందని పవన్ ఆరోపణ**

**బాధితులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శ**

తెలంగాణ రాష్ట్రం షాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక లేఖ రాశారు. పోక్సో చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఉదంతాన్ని పవన్ కల్యాణ్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, 16 ఏళ్ల బాధితురాలితో పాటు ఆమె తల్లి, నానమ్మను పొట్టనబెట్టుకున్నాడు. ఆ తర్వాత తనతో గొడవపడుతుందని భార్య, ఇద్దరు పిల్లలను చంపేసి, ఆపై తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో దర్యాప్తులో నిర్దిష్ట కాలపరిమితిని పాటించాలని, సాక్ష్యాధారాలు తారుమారుకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సదరు కేసులో నిందితుడికి ముందస్తు బెయిల్ లభించడం, అదే సమయంలో బాధితుల కుటుంబానికి తగిన రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమవడంపై పవన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. పోక్సో కేసులకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.



## అమెజాన్‌తో 'ఫ్యూచర్'

-మొదటిపేజీ తరువాయి

అమెజాన్ వెబ్ సర్వీసెస్ నూతన డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. '2025 డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించాం. 108 దేశాలకు చెందిన 3 వేల మంది వివిధ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సు సందర్భంగా రూ.60 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు అమెజాన్ తెలిపింది. కానీ రాష్ట్ర అవసరాలకు అది సరిపోదు. 2034 నాటికి అమెజాన్ రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెట్టాలి. ఈ స్థాయిలో పెట్టుబడులు వస్తేనే 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలన్న లక్ష్యాన్ని చేరుకోగలం. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యం. 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలపాలన్న వికసిత భారత్--2047 లక్ష్యంలో భాగంగా జాతీయ జీడీపీలో తన వాటాను ప్రస్తుతం ఉన్న 5 నుంచి 10 శాతానికి పెంచుకునేలా తెలంగాణ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన కీలకం. ఇందులో భాగంగా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి, అనుమతులను ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది ..'అని సీఎం తెలిపారు.

### అభివృద్ధికి నమూనాగా తెలంగాణ

'ఫ్యూచర్ సిటీని అత్యంత అధునాతన నగరంగా నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతి నెలా పరిశ్రమల స్థాపనకు సంబంధించి అన్ని అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తున్నాం. అమెజాన్ పెట్టుబడులకు సంబంధించి కూడా ప్రతి నెలా ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం . తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధికి నమూనాగా నిలపాలనే ఆలోచనతో తెలంగాణ రైజింగ్ పాలసీని రూపొందించాం. పరిశ్రమలు, పర్యాటకం, ఇంధనం, ఆరోగ్యం, క్రీడలు వంటి రంగాల్లో నిర్దిష్ట పాలసీలు రూపొందించాం. ఉద్యోగాల కల్పన కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. ఔటర్ రింగ్ రోడ్డు, ఐటీ, ఫార్మా కంపెనీలు, అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుతో హైదరాబాద్ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల 1.34 కోట్ల మంది నివసిస్తున్నారు. అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలన్నదే మా ధ్యేయం..'అని రేవంత్ చెప్పారు.

### ఎలక్ట్రిక్ రైడ్ దిశగా..

'మూడు లక్షల ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. నగరంలో డీజిల్ మీద ఆధారపడి నడుస్తున్న 2 లక్షల ఆటోలను రెట్రో ఫిట్టింగ్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈవీల రిజి?రస్టేషన్‌కు పన్నును పూర్తిగా మినహాయించి హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏడాదికి రూ.1,500 కోట్ల ఆదాయాన్ని కోల్పోయినప్పటికీ ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. దేశంలో ఇతర నగరాల్లో ఉన్న కాలుష్య సంబంధిత సమస్యలు హైదరాబాద్‌లో ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా రాష్ట్రాన్ని విభజించాం. సమగ్ర ప్రణాళికతో అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాం. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల కోసం భూములను త్యాగం చేసిన రైతులను ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటాం. భూమి ఇచ్చి అభివృద్ధికి సహకరించిన రైతులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అధికారులు చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి అవసరమైన నష్ట పరిహారాన్ని అందించాలి. ఆందోళనలు చేపడుతున్న రైతులతో మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కె.లక్ష్మారెడ్డి చర్చించాలి. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలను, మంచి నష్ట పరిహారాన్ని అందించాలి..'అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### నిరంతర విద్యుత్, నీటి సరఫరా: మంత్రి శ్రీధర్‌బాబు

ప్రభుత్వం నియంత్రణ సంస్థ కాదని, పరిశ్రమలకు ఒక సులభతరమైన సదుపాయకర్తగా మాత్రమే పనిచేస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. డేటా సెంటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఆలూరులో ఒక డేటా సెంటర్ పార్కును ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇక్కడ డేటా సెంటర్లకు అత్యంత కీలకమైన వనరులైన నిరంతర విద్యుత్, నీటి సరఫరాతో సహా సమగ్ర వసతులను కల్పిస్తున్నామని చెప్పారు.

## తెలంగాణలో ఎస్ఐఆర్ గడుపు పెంపు



-మొదటిపేజీ తరువాయి

ఆ రోజు నుంచి సెప్టెంబరు 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అక్టోబరు 8వ తేదీ వరకు అభ్యంతరాలను పరిశీలించి అదే నెల 12న తుది జాబితాను ప్రకటిస్తారు. ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ దాదాపు పూర్తయినప్పటికీ, ఓటర్లు వాటిని నింపి ఇవ్వాల్సి ఉంది. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ దాదాపు సగమే పూర్తయింది. రాష్ట్రంలో ఎస్ఐఆర్ షెడ్యూలును కేంద్ర ఎన్నికల కమిషన్ సవరించింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వినతి మేరకు పది రోజులు పొడిగించింది. గత నెల 25 నుంచి రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. పాత షెడ్యూలు ప్రకారం ఈనెల 24వరకు ఎన్యుమరేషన్ ప్రక్రియ జరగాల్సి ఉంది. రాష్ట్రంలో 3 కోట్ల 38 లక్షల 26 వేల 448 మంది ఓటర్లందరికీ ఎన్యుమరేషన్ ఫారాలు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 99.99శాతం పూర్తయింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇంకా కొన్ని ఫారాలు ఇవ్వాల్సి ఉండగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రమంతటా ఫారాల పంపిణీ పూర్తయిందని సీఈవో కార్యాలయం వెల్లడించింది. అయితే ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు నింపి తిరిగి ఇచ్చే ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 55 శాతం ఓటర్లే ఫారాలు నింపి ఇచ్చారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలు వెనకబడి ఉన్నాయి.

### అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా విడుదల

ఓటర్లకు 2002 జాబితాలో పేర్లు వెదకడం కష్టంగా ఉండటం బీఎల్‌ఓలు అందుబాటులో లేకపోవడం వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని ఓటర్లతో పాటు రాజకీయ పార్టీలు కోరాయి. క్షేత్రస్థాయి పరిస్థితులను వివరిస్తూ ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి లేఖ రాశారు. కొత్త షెడ్యూలు ప్రకారం ఎన్యుమరేషన్ ప్రక్రియ ఆగస్టు 3వ తేదీ వరకు జరగనుంది. ఆగస్టు 3వరకు ఎన్యుమరేషన్ ఫారాలన్నీ నింపి బీఎల్‌ఓలకు ఇవ్వాల్సి ఉంటుంది. ఎన్యుమరేషన్ ఫారం నింపి ఇవ్వక పోతే ముసాయిదా జాబితాలో ఓటు ఉండదని ఈసీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తయ్యాక ఆగస్టు 10 వతేదీన డ్రాఫ్ట్ జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది. ముసాయిదా జాబితాలో పేరు లేకపోయినా ఎలాంటి అభ్యంతరాలున్నా ఆగస్టు 10 నుంచి సెప్టెంబరు 9 వరకు సమర్పించవచ్చు. ఓటర్ల అభ్యంతరాలు, క్లెయిమ్‌లను ఆగస్టు 10 నుంచి అక్టోబరు 8 వరకు పరిశీలించి, పరిష్కరిస్తారు. ప్రక్రియ అంతా పూర్తి చేసి అక్టోబరు 12న తుది ఓటరు జాబితాను కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటిస్తుంది.

# ఏఐటీయుసిపై విమర్శలు మానుకోవాలి

**రియాజ్ అహ్మద్ నోరు అదుపులో పెట్టుకోవాలి**
**: కవ్వంపల్లి స్వామి**
**గోదావరిఖనిలో ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశం**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న ఏఐటీయుసిపై అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని, హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి హెచ్చరించారు. గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో బుధవారం నిర్వహించిన ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణిలో ఇప్పటివరకు జరిగిన ఏడు గుర్తింపు సంఘం ఎన్నికల్లో నాలుగు సార్లు ఏఐటియుసి విజయం సాధించిందని, కార్మికుల హక్కుల పరిరక్షణకు అనేక ఒప్పందాలు కుదుర్చి సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించిన చరిత్ర తమ సంఘానికి ఉందన్నారు. ఏరియా స్థాయిలో ఒక్కచోట కూడా గుర్తింపు పొందని హెచ్ఎంఎస్ నాయకులు, కార్మికుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏఐటియుసిపై వ్యక్తిగత విమర్శలకు దిగడం తగదని అన్నారు. కార్మికుల ప్రయోజనాల కోసం ఉద్యమాలు నిర్వహించి యాజమాన్యం, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి అనేక హక్కులు సాధించిన సంఘం ఏఐటియుసి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌లో ఎంపీగా, ఎమ్మెల్సీగా, టిబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా పదేళ్లపాటు ఉన్న కవిత సింగరేణి కార్మికులకు గానీ, సంస్థకు గానీ చెప్పుకోదగ్గ ప్రయోజనం చేకూర్చలేదని విమర్శించారు. ప్రస్తుతం తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరుతో, హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నా సింగరేణి కార్మికులకు ఒరిగేదేమీ లేదన్నారు.

హెచ్ఎంఎస్ నిర్వహిస్తున్న "బాయి బాట" కార్యక్రమం ద్వారా ఏఐటియుసిపై చేస్తున్న విమర్శలను కార్మికులు గమనిస్తున్నారని, ఇకనైనా రియాజ్ అహ్మద్ వ్యక్తిగత విమర్శలు మానుకుని కార్మిక సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు.


ఈ సమావేశంలో ఏఐటియుసి ఆర్జీ-1 బ్రాంచి ఆఫీస్ బేరర్ సిర్ర మల్లికార్జున్, నాయకులు ఎర్రగొల్ల చేరాలు, పడాల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదమ్ముల అనుబంధం..

**ఈ తరానికి ఆదర్శం**
**ఆలోచనలో ఒకటే.. నిర్ణయాల్లో సమిష్టి..**
**సంతోషం--విషాదంలోనూ కలిసే అడుగులు**

**అగ్ని ధార న్యూస్ (రామగుండం):**

నేటి సమాజంలో కుటుంబ బంధాలు క్రమంగా బలహీనపడుతున్నాయని పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్న వేళ, కొందరు అన్నదమ్ములు మాత్రం తమ అనుబంధంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. పరస్పర గౌరవం, ఆప్యాయత, నమ్మకం, బాధ్యతలతో కూడిన వారి బంధం కుటుంబ విలువలకు ప్రతీకగా నిలుస్తోంది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ తన సోదరులతో కొనసాగిస్తున్న ఆప్యాయ అనుబంధం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. కుటుంబ విషయాల్లోనే కాదు, సామాజిక కార్యక్రమాలు, ప్రజా సేవ, ముఖ్యమైన నిర్ణయాల్లోనూ పరస్పరం చర్చించుకుని సమిష్టిగా ముందుకు సాగడం వారి కుటుంబ ప్రత్యేకతగా కనిపిస్తోంది. సంతోషం వచ్చినా కలిసి పంచుకోవడం... కష్టాలు ఎదురైనా ఒకరికొకరు అండగా నిలవడం... విజయాన్ని అందరూ కలిసి ఆస్వాదించడం... బాధను అందరూ కలిసి భరించడం... ఇలాంటి విలువలే అన్నదమ్ముల బంధాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి. ఒకరిపై మరొకరికి ఉన్న విశ్వాసం, ఆప్యాయత కుటుంబ సభ్యులతో పాటు సమాజానికీ మంచి సందేశాన్ని ఇస్తోంది. ప్రస్తుత కాలంలో ఆస్తులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం అన్నదమ్ముల మధ్య విభేదాలు పెరుగుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో పరస్పర ప్రేమాభిమానాలతో, ఐక్యతతో ముందుకు సాగుతున్న కుటుంబాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఈ విలువలను కాపాడుకోవడం ప్రతి కుటుంబం బాధ్యతగా భావించాలని సామాజికవేత్తలు సూచిస్తున్నారు. ముఖ్యంగా యువత కుటుంబ బంధాల విలువను అర్థం చేసుకుని, అన్నదమ్ముల మధ్య ప్రేమ, గౌరవం, పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పెద్దలు అభిప్రాయపడుతున్నారు. రక్త సంబంధం కంటే ఆత్మీయత, పరస్పర నమ్మకం, కలిసికట్టుగా ఉండాలనే మనస్తత్వమే కుటుంబాన్ని బలంగా నిలబెడుతుందని చెబుతున్నారు. అన్నదమ్ములు కలిసి చిరునవ్వులతో కనిపించే ఒక ఫోటో కేవలం ఓ జ్ఞాపకం మాత్రమే కాదు... ప్రేమ,



విశ్వాసం, కుటుంబ ఐక్యతకు ప్రతీక. అలాంటి అనురాగ బంధాలు ప్రతి ఇంటిలో నెలకొని, ఈ తరం యువతకు స్ఫూర్తిగా నిలవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

# గంగా ప్రసాద్ కు జాతీయ అంబేద్కర్ అవార్డు

**ఘనంగా సన్మానించిన బీఆర్ఎస్**
**రాష్ట్ర నాయకులు కౌశిక హరి లత**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

రామగుండం ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త కుక్క గంగాప్రసాద్కు డా. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు--2026 లభించడం పట్ల స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జన సాహిత్య అకాడమీ చైర్మన్ పాముల రమణ, తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, జాతీయ అంబేద్కర్‌వాది జె.బి. రాజు చేతుల మీదుగా గంగాప్రసాద్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నారు.



ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి లత తమ నివాసంలో గంగాప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళిత, బహుజన హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్న గంగాప్రసాద్‌కు జాతీయ స్థాయి గుర్తింపు రావడం రామగుండం ప్రాంతానికే గర్వకారణమని అన్నారు. సమాజ సేవలో ఆయన చేస్తున్న సేవలకు తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. జర్నలిస్టు ఆరెపల్లి క్రాంతికుమార్ మాట్లాడుతూ, గత 25 ఏళ్లుగా గంగాప్రసాద్ సమాజ సేవలో నిబద్ధతతో పనిచేస్తున్నారని, ఆయనకు ఈ అవార్డు రావడం పట్టణ ప్రజలందరికీ ఆనందకర విషయమని కొనియాడారు.

అవార్డు గ్రహీత కుక్క గంగాప్రసాద్ మాట్లాడుతూ, ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. తనను ఈ అవార్డుకు ఎంపిక చేసిన జన సాహిత్య అకాడమీ చైర్మన్ పాముల రమణ, జాతీయ అంబేద్కర్‌వాది జె.బి. రాజు, తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్యతో పాటు ప్రతి కార్యక్రమంలో తనకు అండగా నిలుస్తున్న కౌశిక హరి లతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సన్మాన కార్యక్రమంలో మద్దికుంట శంకర్, నిమ్మరాజుల రవి, మాడిశెట్టి రవి, ఆరుముల్ల కనకపాల్, బోనగిరి కుమార్, ఈదునూరి సదానందం, ఋషిపాక గంగారాం, యూనిస్, మహేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ వేగవంతం

**7, 8వ డివిజన్లలో ప్రత్యేక కార్యక్రమం..**
**ఓటర్లందరూ వినియోగించుకోవాలని పిలుపు**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**





రామగుండం ఎమ్మెల్యే ఆదేశాలు, మేయర్ సూచనల మేరకు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగవంతం చేసే దిశగా బుధవారం 7వ, 8వ డివిజన్లలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. 7వ డివిజన్ కార్పొరేటర్ రమాదేవి శ్రీనివాస్ గౌడ్, 8వ డివిజన్ కార్పొరేటర్ పుష్పలత బాబు సహకారంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా అధికారులు దాదాపు 60 శాతం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. 7, 8, 9వ డివిజన్ల ఇన్‌చార్జి బెంది నాగభూషణం గౌడ్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు ఇంకా అవకాశం ఉన్నందున అర్హులైన ఓటర్లందరూ ముందుకు వచ్చి నమోదు ప్రక్రియలో పాల్గొని సహకరించాలని కోరారు. ఓటరు వివరాల నమోదు, మ్యాపింగ్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు రాజమణి, రమాదేవి, సరిత, రజిత, విజయలక్ష్మితో పాటు ఓటరు మ్యాపింగ్ కోసం వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్ ల ఫోరం మండల కార్యనిర్వాహక అధ్యక్షుడీగా మచ్చ గణేష్ ఏకగ్రీవం

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**



గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ ఉప సర్పంచ్ ల ఫోరం మండల కార్యనిర్వాహక అధ్యక్షుడీగా మచ్చ గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగదేవపూర్ మండల ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు కంచర్ల స్వామి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమావేశమై మండల ఉప సర్పంచ్ ల ఫోరం కార్యనిర్వాహక అధ్యక్షుడీ గా జగదేవపూర్ గ్రామ ఉప సర్పంచ్ మచ్చ గణేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల ఉప సర్పంచ్ ల ఫోరం కార్యనిర్వాహక అధ్యక్షుడు మచ్చ గణేష్ మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన మండల ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు స్వామి మండల ఉపసర్పంచులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. కాగా నూతనంగా ఎన్నికైన మచ్చ గణేశు ని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌తో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ భేటీ

**రామగుండం అభివృద్ధి పనులపై సమీక్ష..**
**పెండింగ్ పనులు వేగవంతం చేయాలని సూచన**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**



రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ బుధవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, రోడ్లు--భవనాల (ఆర్ అండ్ బీ) శాఖ, రోడ్డు కార్పొరేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, రహదారుల మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలను త్వరితగతిన అందించేందుకు పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రామగుండం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



తలకొండపల్లి మండలం వీరన్న పల్లి గ్రామంలో ఎంజీ ఎన్ ఆర్ జి ఎస్ నిధుల నుండి 5 లక్షలు , ఎచ్ ఎం డి ఎ నిధుల నుండి 15 లక్షలు గ్రామ పంచాయతీ బిల్డింగ్ కు 20 లక్షలు కేటాయించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామాలలోని సి సి రోడ్ మరియు అండర్ డ్రైనేజీ,గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో, మండల పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, సర్పంచ్ రామలక్ష్మన్,ఉప సర్పంచ్ రవి యాదవ్ ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, జిల్ల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రఘురాములు, మరియు వివిధ గ్రామాల సర్పంచ్లు ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు మరియు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బంతి కోసం బావిలోకి.. విద్యార్థి ప్రాణం బలి



**క్రికెట్ ఆడుతూ విషాదం..**
**లింగాపూర్ మోడల్ స్కూల్ లో కన్నీరుమున్నీరు**
**ఆటలో అప్రమత్తత కోల్పోయిన బాలుడు..**
**కుటుంబంలో తీరని విషాదం**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

క్రికెట్ ఆడుతూ బంతి కోసం బావిలోకి దిగిన ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు మృతి చెందడం రామగుండం మండలంలోని లింగాపురం గ్రామంలో విషాదాన్ని నింపింది. సరదాగా సాగిన ఆట క్షణాల్లోనే విషాదాంతంగా మారడంతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాపురం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి బుధవారం స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతున్నాడు. ఈ క్రమంలో బంతి సమీపంలోని బావిలో పడింది. బంతిని తీసుకురావాలనే ఉద్దేశంతో బాలుడు బావిలోకి దిగగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. తోటి విద్యార్థులు కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకుని బాలుడిని బయటకు తీశారు. అనంతరం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం.

బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కారు దిగి కాంగ్రెస్ లోకి.....
## . కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు కార్పొరేటర్లు



**ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సమక్షంలో పార్టీలో చేరిక**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

రామగుండం రాజకీయాల్లో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు, పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సమక్షంలో 28వ డివిజన్ కార్పొరేటర్ ధారంగుల కుమార్, 26వ డివిజన్ కార్పొరేటర్ భగవత్ నరసింహ సారయ్య నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శివరాత్రి గంగాధర్తో పాటు ఆయా డివిజన్లకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వారిని పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు. కార్యక్రమంలో రామగుండం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు వీటి బాలరాజు, మాజీ కార్పొరేటర్ మొహమ్మద్, కుందనపల్లి సర్పంచ్ అరుకుటి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రామగుండం నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతోందని, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే వెంట నడుస్తూ ప్రజాసేవకు కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు.

## గ్రామాభివృద్ధికి పాటుపడదాం.



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్**

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరం పాటు పడదామని గుండారం గ్రామ సర్పంచ్ జంగిలి పోచాలు అన్నారు. బుధవారం కమాన్ పూర్ మండలం గుండారం గ్రామపంచాయతీ పరిధిలోని ఆరో వార్డులో ఉపాధి హామీ పథకం లో 5 లక్షలు మంజూరు కాగా ఆకుల శంకర్ ఇంటి నుండి మత్స్య స్వామి ఇంటి వరకు అట్టిసీసీ రోడ్డు పనులను సర్పంచ్ మరియు వార్డు సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామంలోని సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంబిలి రాజేందర్, వార్డు సభ్యులు పిడుగు ఎల్ఐసి సది, గాదెలతా, వడ్లకొండ వసంత, గరిగంటి కృష్ణ, గరిగంటి పద్మ, గ్రామ కార్యదర్శి బచ్చుల ప్రసాద్, కారోబా రాచకొండ భీమరాజు, నాయకులు వడ్లకొండ శంకర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



వెల్దండ మండల కేంద్రానికి చెందిన గంగా పురం పార్వతమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది విషయం తెలుసుకున్న సర్పంచి మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ వారి నివాసానికి చేరుకొని కటుంబానికి సానుభూతి తెలుపుతూ పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ,వార్డు సభ్యులు పాలది మల్లీశ్వరి రంగనాథం,గుద్దటి కిష్టల్,మసిగుండ్ల వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొయ్యల పుల్లయ్య, మట్ట భారత్, రేవల్లి దర్గయ్య, రేవల్లి బాలరాజు, తుంగ శ్రీను,మోర శ్రీను, మహేష్, ఆంజనేయులు, సుధాకర్,తదితరులు ఉన్నారు.

# గంగా ప్రసాద్ కు జాతీయ అంబేద్కర్ అవారు

**ఘనంగా సన్మానించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి లత**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

రామగుండం ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త కుక్క గంగాప్రసాద్కు డా. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు--2026 లభించడం పట్ల స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జన సాహిత్య అకాడమీ చైర్మన్ పాముల రమణ, తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, జాతీయ అంబేద్కర్‌వాది జె.బి. రాజు చేతుల మీదుగా గంగాప్రసాద్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి లత తమ నివాసంలో గంగాప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళిత, బహుజన హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్న



గంగాప్రసాద్‌కు జాతీయ స్థాయి గుర్తింపు రావడం రామగుండం ప్రాంతానికే గర్వకారణమని అన్నారు. సమాజ సేవలో ఆయన చేస్తున్న సేవలకు తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. జర్నలిస్టు ఆరెపల్లి క్రాంతికుమార్ మాట్లాడుతూ, గత 25 ఏళ్లుగా గంగాప్రసాద్ సమాజ సేవలో నిబద్ధతతో పనిచేస్తున్నారని, ఆయనకు ఈ అవార్డు రావడం పట్టణ ప్రజలందరికీ ఆనందకర విషయమని కొనియాడారు. అవార్డు గ్రహీత కుక్క గంగాప్రసాద్ మాట్లాడుతూ, ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. తనను ఈ అవార్డుకు ఎంపిక చేసిన జన సాహిత్య అకాడమీ చైర్మన్ పాముల రమణ, జాతీయ అంబేద్కర్‌వాది జె.బి. రాజు, తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్యతో పాటు ప్రతి కార్యక్రమంలో తనకు అండగా నిలుస్తున్న కౌశిక హరి లతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో మద్దికుంట శంకర్, నిమ్మరాజుల రవి, మాడిశెట్టి రవి, ఆరుముల్ల కనకపాల్, బోనగిరి కుమార్, ఈదునూరి సదానందం, బుషిపాక గంగారాం, యూనిస్, మహేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

**మండల అధ్యక్ష కార్యదర్శులు దేశం సైదులు, అమీర్ పిలుపు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్ నగర్ చౌరస్తాలో ప్రతి ఆటో డ్రైవర్ కు 12 వేల రూపాయలు ఇవ్వాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి) కల్వకుర్తి మండల అధ్యక్ష కార్యదర్శులు దేశం సైదులు, అమీర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు ప్రతి సంవత్సరానికి 12 వేల రూపాయలు చెల్లిస్తానని నేటికీ కూడా ఆ హామీని నెరవేర్చడం లేదని అన్నారు. ఆటో డ్రైవర్ల పై ఆర్టీవో పోలీసుల వేధింపులు కూడా ఆపాలని అన్నారు. జూలై 26వ తేదీన తాడూరు మండల కేంద్రంలో ఎఐటియుసి జిల్లా 3వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరై మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు పులిజాల పరశురాం, నాయకులు రాజేష్, మహేష్, యాదగిరి, అక్బర్, మజీద్, శేఖర్, జనార్ధన్, బాలస్వామి, రవీందర్, బాబా తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల ఆశ్రమ పాఠశాల కళాశాలలో సర్పంచ్ శేఖర్ యాదవ్ జన్మదిన వేడుకలు



**కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ఉపాధ్యాయులు విద్యార్థులు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ జన్మదిన సందర్భంగా మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ వారి ఉప్పల ఆశ్రమ పాఠశాల కళాశాల లో 400 మంది విద్యార్థులకు బాలికలు భోజనం ఏర్పాట్లు చేసిన సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ,పుట్టినరోజు వేడుకలను ఉప్పల ఆశ్రమ పాఠశాల మరియు కళాశాల నందు చిన్నారులతో కలిసి జరుపుకోవడం నాకు చాలా సంతృప్తిని ఇచ్చింది అని వారి చిరునవ్వుల్లో కనిపించిన సంతోషం వారితో కలిసి భోజనం చేస్తూ గడిపిన ఈ మధుర క్షణాలు నా జీవితంలో చిరస్మయంగా నిలిచిపోతాయి. చిన్నారులకు అవసరమైన సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ నూకం కోటేశ్వర్, మాజీ సర్పంచ్ లలితడ జ్యోతయ్య, వార్డు సభ్యుడు వెంకటేష్ యాదవ్, అఖిల్ మరియు ఆశ్రమ ప్రిన్సిపల్ మరియు లెక్చరర్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి



**ఎమ్మెల్యే సహకారంతో చెక్కు అందజేసిన మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన తిరుమని సత్యమ్మ భర్త సత్యనారాయణ గౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు అర్థిక పరిస్థితుల వలన స్థానిక నాయకులు మాజీ ఉప సర్పంచ్ అజీజ్ ద్వారా ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి 60000-00 వేల రూపాయలు చెక్కును సత్యమ్మ భర్త సత్యనారాయణ గౌడ్ కివెల్జాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి , నాయకులు అంజయ్య గౌడ్, శ్రీనివాసమూర్తి ఆంబాజి , వెంకట్ రెడ్డి, నర్సింలు, అజీజ్, కృష్ణయ్య గౌడ్ ,వద్దే రాజు, జాఫర్, పులిజాల విష్ణు ఎండి నసిర్ , జాఫర్, బి బాలస్వామి, జంగయ్య, కాంగ్రెస్ నాయకులు ,తది తరులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి ఇసుక మాఫియా పై చర్యలు

**అగ్నిధారన్యూస్ జగదేవపూర్**



మండలం తిగుల్ నర్సాపూర్ గ్రామ కొత్త చెరువులో అక్రమ మట్టి(ఇసుక) తవ్వకం జరిపి, ఫామ్ హౌస్ కి తరలిస్తున్న రమేష్ అను వారిపైన పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అట్టి వ్యక్తి పైన తగు చర్యలు తీసుకోవలసిందిగా బుధవారం జగదేవపూర్ మండల రెవెన్యూ అధికారి ఎస్ .నిర్మలని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. అందుకు తహసీల్దార్ సానుకులంగా స్పందించి తగు చర్యలు తీసుకోవడం జరుతుందని తెలిపారు. విరితో పాటుగా హరిబాబు కనకయ్య నాయకులు తదితరులు ఉన్నారు.

## రాజకీయ కక్షసాధింపుతోనే అనాడు కాంగ్రెస్ నేతలపై అక్రమ కేసులు

**కోర్టుకు హాజరైన కాంగ్రెస్ నాయకులు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి తలకింద పల్లి టీఆర్ఎస్ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ ప్రమేయంతో, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులపై బనాయించిన అక్రమ కేసుల వలన కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్, మార్కెట్ కమిటీ డైరక్టర్ అజీమ్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ కాటికే నరేష్, యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, మరియు యువజన కాంగ్రెస్ నాయకులు తిరుపతి ఇరోజు కోర్టులో న్యాయ స్థానం ముందు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ,గత ప్రభుత్వ హయాంలో అధికార బలంతో, స్థానిక టీఆర్ఎస్ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ కాంగ్రెస్ శ్రేణులను ఇబ్బంది పెట్టడమే ధ్యేయంగా తప్పుడు కేసులు పెట్టించారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయడానికి ఇటువంటి అక్రమ కేసులను ఆశ్రయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా భయపడే ప్రసక్తే లేదని, న్యాయస్థానాలపై తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. ఈ అక్రమ కేసుల నుండి తాము త్వరలోనే నిర్దోషులుగా క్లీన్ చిట్‌తో బయటకు వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో, కోర్టుకు హాజరైన వారికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి తమ సంఘీభావాన్ని ప్రకటించారు

## ఎస్ఐఆర్ పక్రియ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**అవగాహన కల్పించిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్‌పై ప్రతి ఒక్కరికి పూర్తి స్థాయిలో అవగహన కల్పించడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో బీఎల్ వోలు, బి ఎల్ ఏ చేపట్టిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గుప్త ,మాజీ ఉప సర్పంచ్ అజీజ్ తో కలిసి మాట్లాడుతూ.ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదని పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదైన ఉందో లేదో పరిశీలించు కోవడంతో పాటు అవసరమైన సవరణలు చేసుకునేలా అవగహన కలిగి ఉండాలని సూచించారు. ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఎస్ఐఆర్ ప్రక్రియన నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబంలోని ఓటర్లు తమ వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి స్థాయిలో నమోదు చేసి బి ఎల్ ఓ, బీఎల్ఎలకు అందజేయాలని ఓటర్లకు ఆయన సూచించారు. కార్యక్రమంలో,శ్రీనివాసమూర్తి ,అంజయ్య గౌడ్, అంబాజి, నర్సింలు, అజీజ్ , కృష్ణయ్య గౌడ్, రాజు, పులిజాల విష్ణు, జాఫర్, అంగన్వాడి టీచర్ లు వసంత లక్ష్మి, భూషణమ్మ, నశ్రీన్ బేగం, బిఎల్వోలు చంద్రకళ, సుధా,బుక్ కిపర్ కల్పన తదితరులున్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మండల అధ్యక్షులు జోగయ్య

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



వెల్దండ మండల కేంద్రానికి చెందిన ఆర్మీ రిటైర్మెంట్ భీమయ్య తల్లి పార్వతమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు కార్యక్రమంలో, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, మాజీ సర్పంచ్ గుద్దేటి ప్రభాకర్, బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కొమ్ము నాగయ్య, సీనియర్ నాయకులు జంగిలి దేవదాస్, మంగళగిరి సత్యం, దాసరి బాలయ్య, జంగిలి శ్రీనివాసులు, జంగిలి తిరుపతయ్య, తుంగ శీను, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## జూలపల్లి గ్రామంలో విజయ వంతంగా ముగిసిన ఉచిత వైద్య పరీక్షలు



**సద్వినియోగం చేసుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు సర్పంచ్ శేఖర్ యాదవ్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలంలోని జూలపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ కదారి శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో, కామినేని హాస్పిటల్, ఎల్.బి. నగర్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపు విజయవంతంగా ముగిసింది.ఈ మెడికల్ క్యాంపులో గ్రామానికి చెందిన 200 మందికి పైగా గ్రామస్తులు పాల్గొని వైద్య సేవలను,వినియోగించుకున్నారు.వైద్య బృందం బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు జ్వరం, జలుబు, శరీర నొప్పులు, బలహీనత వంటి సాధారణ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ కదారి శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ఇటువంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయించిన సర్పంచ్ కదారి శేఖర్ యాదవ్ కి మరియు కామినేని హాస్పిటల్ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో, ఉప సర్పంచ్ ఇంద్రకంటి శ్రీశైలం గౌడ్, వార్డు సభ్యులు అల్లాజీ గౌడ్, జగదీష్ గౌడ్, గ్రామ కార్యదర్శి విజయభాస్కర్, యువ నాయకుడు మధు, గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహిళ సంక్షేమ అభివృద్ధికి పెద్దపీట



**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండల కేంద్రంలోని పెద్దాపూర్ గ్రామంలో మహిళా సంక్షేమం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డి అన్నారు వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామంలో మహిళా శక్తి భవనంతో పాటు ఇందిరమ్మ గృహాలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు అనంతరం గ్రామ సర్పంచ్ కేశమల్ల అనూష అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, మహిళలను అన్ని రంగాలలో ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది అని అన్నారు సంక్షేమ పథకాలను అందిపుచ్చుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని మహిళలకు తీర్పునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీవో సులోచన, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేషమల్ల కృష్ణ, రాజశేఖర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హరికిషన్ నాయక్ , పుల్ సింగ్ నాయక్, వెంకటయ్య గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల ట్రస్ట్ సహకారంతో మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



**ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలం లోని ఎల్లికల్ గ్రామంలో దొడ్డి కాశమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది.ఈ విషయాన్ని బిఆర్ఎస్ పార్టీ అలాగే ఉప్పల టీమ్ సభ్యుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుడి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ ఆర్థిక సహాయం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో, ఉప్పల టీమ్ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు అనిల్ దాదమోని,వార్డు సభ్యుడు ఎముకంటి వెంకటయ్య, బైరపురం తిరుపతయ్య, పబ్బతి రామస్వామి, దాదమోని కూర్మయ్య ,బి శివ, ఎ సురేష్ ,జి ప్రశాంత్, సాయి బాలయ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత

**ట్రస్ట్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం జంగారెడ్డి పల్లి గ్రామంలో నిరుపేద కుటుంబల ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా గ్రామ వాస్తవ్యులు కాకి సాల్వయ్య, మియాడి అమృత, నిరడి స్వప్న లకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సిమెంటు అందజేయడం జరిగింది. వారు కుటుంబం ఉప్పల వెంకటేష్ కి కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామంలో అనేకమైన నిరుపేద ఇండ్లకు ఆదుకుంటున్నారు అని వారికి ఎప్పుడు రుణపడి ఉంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ,తలకొండపల్లి తాజా మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, గ్రామ సర్పంచ్ పసుల మల్లేష్,గ్రామ బీఆర్ఎస్ నాయకులు మీసాల మధు, మోహన్ రెడ్డి,తిరుపతయ్య, శేఖర్, సుధాకర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం కేంద్రాన్ని టార్గెట్ చేసిన సీఎం!

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని పార్టీ రాజకీయాలకు అతీతంగా చూడాలని సూచించిన తర్వాత బీజేపీ ఎంపీలు ఆయనతో సమావేశమయ్యారు. ఈ సమావేశం రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల అనుమతులు, కేంద్ర నిధులు వంటి అంశాలపై దృష్టి సారించింది. రేవంత్ రెడ్డి ఈ సమావేశం తర్వాత ఢిల్లీ ప్రయాణం వ్యూహం అభివృద్ధి ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. రాజకీయ భేదాలను పక్కన పెట్టి రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేస్తుంది. ఇది సాధారణంగా వ్యతిరేక పక్షాల మధ్య సహకారం అరుదైన సందర్భంలో ముఖ్యమైనది. రాష్ట్ర అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, నిధులపై ఆధారపడి ఉండటంతో ఇలాంటి సమన్వయం అవసరం.

# అక్రమ రవాణా చేస్తున్న పిడిఎఫ్ బియ్యం పట్టివేత

గజ్వేల్ రూరల్ సీఐ రవి రాజు ?
పౌరసరఫరాల శాఖ: అసిస్టెంట్ సివిల్ సప్లైస్ ఆఫీసర్ ఏఏస్ఓ

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

సబ్సిడీతో కూడిన నిత్యావసర ధాన్యాల అక్రమ నల్లబజారును అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీసులు చేపట్టిన అత్యంత విజయవంతమైన ఆపరేషన్ ఇది. ఈ దాడికి సంబంధించిన ముఖ్యమైన వివరాలు ఇలా ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న సొత్తు ?అక్రమ రవాణా పి డిఎఫ్ బియ్యం. ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ పిడిఎస్ కు చెందినదిగా భావిస్తున్న ఫోర్టిఫైడ్ పోషక విలువ గల బియ్యం 294.50 క్వింటాళ్లు ఇవి 590 బస్తాల్లో నింపి ఉన్నాయి. ?అంచనా విలువ సుమారు రూ.9 లక్షలు విలువ ఉంటాయని అదేవిధంగా లారీ ద్వారా అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. ?ఆపరేషన్ సంయుక్త బృందం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ముఖ్యంగా గౌరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సమన్వయ దాడి జరిగింది. స్థానిక పోలీసులు, పౌరసరఫరాల అధికారుల సంయుక్త కృషితో ఈ ఆపరేషన్ విజయవంతమైందని ?గజ్వేల్ రూరల్ సీఐ రవి రాజు గౌరారం ఎస్ఐ ఎస్ఐ

**పౌరసరఫరాల శాఖ: అసిస్టెంట్ సివిల్ సప్లైస్ ఆఫీసర్ ఏఏసోఓ**

ప్రస్తుత పరిస్థితి ?స్థానిక అధికారులు లారీతో పాటు 590 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం ఎక్కడి నుండి దారి మళ్లించబడ్డాయి అనే కోణంలో దర్యాప్తు చేయడానికి, అలాగే ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న కీలక వ్యక్తులను పట్టుకోవడానికి అధికారికంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు




# తోటి స్నేహితురాలికి ఆర్థిక సాయం

అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:

స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనంగా 1988-89, 1989-90 విద్యా సంవత్సరాల్లో మహమ్మదాబాద్ జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్‌లో చదువుకున్న జంట బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ తోటి స్నేహితురాలు శశికళకు ఆర్థిక చేయూత అందించారు. కుటుంబ, ఆరోగ్య మరియు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న శశికళ పరిస్థితిని తెలుసుకున్న స్నేహితులు ఆమెకు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు బ్యాచ్‌లోని సభ్యులందరూ స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి మొత్తం రూ.27,400ను మంగళవారం (జూలై 14) సాయంత్రం శశికళకు అందజేశారు. కష్టకాలంలో తోటి స్నేహితురాలికి చేయూత అందించడం తమ బాధ్యతగా భావించి ఈ సహాయాన్ని అందించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా శశికళ భావోద్వేగానికి లోనై తనకు అండగా నిలిచిన సహ విద్యార్థులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలు గడిచినా తమ స్నేహాన్ని మరువకుండా అవసర సమయంలో చేయూత అందించడం ఎంతో ఆనందాన్ని



కలిగించిందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, స్నేహితులు మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా తమ బ్యాచ్‌కు చెందిన ఎవరికైనా అవసరం ఏర్పడితే ఇదే విధంగా సహాయం చేసేందుకు ముందుంటామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించి విరాళాలు అందించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ ఘటన స్నేహానికి, మానవత్వానికి నిదర్శనంగా నిలిచిందని స్థానికులు అభినందించారు.

# సగం మంది టీచర్లే టెట్ పాస్

**హైదరాబాద్ :** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు విడుదలవగా.. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 43.94 శాతం మంది అభ్యర్థులు మాత్రమే అర్హత సాధించి తీవ్ర నిరాశపరిచారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ అధికారికంగా ఈ రిజల్ట్స్‌ను విడుదల చేయగా.. పరీక్ష రాసిన 1.15 లక్షల మందిలో సగం మంది కూడా క్వాలిఫై కాలేకపోయారు. ముఖ్యంగా ప్రస్తుతం విధుల్లో ఉంటూ పరీక్ష రాసిన ఇన్-సర్వీస్ ప్రభుత్వ ఉపాధ్యాయులలో ఏకంగా 14,814 మంది ఫెయిల్ కావడం విద్యాశాఖనుగ్గ్భ్రాంతికి గురిచేసింది. వీరంతా 2028 ఆగస్టు వరకు పాస్ కాకపోతే వీరి ఉద్యోగాలు పోయే అవకాశం ఉంది తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు విడుదల అయ్యాయి. ఈసారి ఫలితాల్లో అభ్యర్థులు తీవ్రంగా నిరాశపరిచారు. పరీక్ష రాసిన వారిలో సగం మంది కూడా క్వాలిఫై కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 43.94 శాతం మంది మాత్రమే అర్హత సాధించారు. హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో టెట్ కన్వీనర్ జి. రమేశ్, టెట్ డైరెక్టర్ రేవతిరెడ్డిలతో కలిసి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఈ ఫలితాలను అధికారికంగా విడుదల చేశారు. మొత్తం 1,15,028 మంది పరీక్షకు హాజరుకాగా.. కేవలం 50,544 మంది మాత్రమే క్వాలిఫై అయ్యారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు అయితే సగం కంటే తక్కువ మంది పాస్ కావడం గమనార్హం. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టుల కోసం నిర్వహించిన పేపర్-1 పరీక్షలో 65.29 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 36,129 మంది పరీక్ష రాయగా 23,590 మంది పాస్ అయ్యారు. అయితే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కోసం నిర్వహించిన పేపర్-2లో ఫలితాలు చాలా ఘోరంగా ఉన్నాయి. పేపర్-2లో మొత్తం 78,899 మంది పరీక్ష రాస్తే కేవలం 26,954 మంది మాత్రమే అర్హత సాధించారు. ఇందులో మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగంలో 40.76 శాతం (17,987 మంది) ఉత్తీర్ణత



సాధించగా.. సోషల్ స్టడీస్ విభాగంలో అత్యల్పంగా 25.79 శాతం (8,967 మంది) మంది మాత్రమే క్వాలిఫై కావడం గమనార్హం. మరోవైపు ప్రస్తుతం విధుల్లో ఉంటూ ఈ పరీక్ష రాసిన ఇన్-సర్వీస్ ప్రభుత్వ ఉపాధ్యాయుల ఫలితాలు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. మొత్తం 23,623 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పరీక్షకు హాజరుకాగా.. కేవలం 8,809 మంది (37.29%) మాత్రమే క్వాలిఫై అయ్యారు. ఏకంగా 14,814 మంది ఉపాధ్యాయులు ఫెయిల్ కావడం విద్యాశాఖ వర్గాలను విస్మయానికి గురిచేసింది. గతేడాది ప్రభుత్వ టీచర్ల పాస్ పర్సంటేజ్ 50 శాతంగా ఉండగా.. ఈసారి అది 37.29 శాతానికి పడిపోయింది. ఇన్-సర్వీస్ టీచర్లలో పేపర్-1లో 52.57 శాతం, పేపర్-2 మ్యాథ్స్ అండ్ సైన్స్‌లో 38.27 శాతం, సోషల్‌లో అత్యంత దారుణంగా 24.05 శాతం మంది మాత్రమే పాస్ అయ్యారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం.. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు 2028 ఆగస్టు నాటికి ఖచ్చితంగా టెట్ పరీక్ష పాస్ కావాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ డెడ్‌లైన్‌లోగా టెట్ క్వాలిఫై కాకపోతే వారు తమ ప్రభుత్వ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుంది. అయితే తాజా పరీక్షలో 14 వేల మందికి పైగా టీచర్లు ఫెయిల్ కావడంతో వారి ఉద్యోగ భద్రతపై తీవ్రమైన ఆందోళన నెలకొంది.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీ హెచ్ డబ్ల్యు కోర్స్



ప్రిన్సిపాల్ బానోత్ రాజన్న నాయక్

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ నియోజకవర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల జగదేవపూర్ లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంపీహెచ్ డబ్ల్యూ ఒకేషనల్ కోర్స్ అందుబాటులోకి వచ్చిందని అతి తక్కువ కాలంలో స్థిరపడడానికి హెల్త్ డిపార్ట్మెంట్ లో ఎక్కువ ఉద్యోగ అవకాశాలు గల ఈ కోర్సు చేయడానికి ఎక్కువ మంది విద్యార్థులు మక్కువ చూపుతున్నారని చాలామంది తల్లిదండ్రుల కోరిక మేరకు కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజన్న గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రయత్నం చేయగా ఈ సంవత్సరం నుండి ఈ కళాశాలకు ఈ ఒకేషనల్ కోర్స్ మంజూరు అయినట్టు తెలియజేశారు. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ శ్రీమతి చాందీ కుమారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ కోర్సు అందుబాటులో లేక సుదూర ప్రాంతాలకు భువనగిరి గజ్వేల్ హైదరాబాద్ మొదలగు ప్రాంతాలకు వెల్లి అత్యధిక డబ్బులు వెచ్చించి చదవలేని పరిస్థితిలో ఉన్న సమయంలో ప్రభుత్వ కళాశాలలో ఈ కోర్స్ మంజూరు కావడంతో ఎంతోమంది పేద విద్యార్థులకు ఈ కోర్స్ అందుబాటులోకి వచ్చిందని తెలియజేస్తూ ఈ కోర్సులో ఇప్పటికే దాదాపు 20 మంది విద్యార్థులు చేరారని ఇంకా ఈ కోర్సులో చేరడానికి అవకాశం ఉందని అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ గజ్వేల్ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆశీస్సులు తీసుకున్న పెద్దబాయ్ శ్రీనివాస్ రెడ్డి



అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ నియోజకవర్గం పెద్దబాయ్ శ్రీనివాస్ రెడ్డికి గజ్వేల్ మాజీ శాసనసభ్యులు నర్సారెడ్డి గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి ఆశీస్సులు తీసుకోని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ఉండి , ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ జగదేవపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇమ్మడి శివలక్ష్మి జహంగీర్ జగదేవపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొంపెల్లి కరుణాకర్ మండల నాయకులు ఎండీ అజిస్ వార్డు సభ్యులు వెంకటేష్ తదితర నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తిలో మరో రెండు డయాలసిస్ మిషన్లు ప్రారంభించిన ఎమ్మెల్యే




అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో మరో రెండు కొత్త డయాలసిస్ మిషన్లు అందుబాటులోకి రానున్నా యి. ప్రస్తుతం ఆసుపత్రిలో ఐదు డయాలసిస్ మిషన్ల ద్వారా 47మంది మూత్రపిండాల వ్యాధి గ్రస్తులకు క్రమం తప్పకుండా చికిత్స అందిస్తున్నారు. రోగుల సంఖ్య పెరుగుతుండడంతో మరో 18మంది వెయిటింగ్ జాబితాలో ఉంటు న్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవ తీసుకుని రెండు కొత్త డయాలసిస్ మిషన్లను మంజూరు చేయించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డి రెడ్డి ప్రారంభించనున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం, యూనిట్ టెక్నీ షియన్ల డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో, మునిసిపల్ చైర్ పర్సన్ భృంగి రత్నమాల ఆనంద్ కుమార్, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లెల్ల రాములు, కౌన్సిలర్ లు,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గులాబీ రెడ్ పాలిటిక్స్..

**హైదరాబాద్ :** తెలంగాణలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని, ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయడం లేదని ఆరోపిస్తూ.. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ పార్టీ బ్లడ్ పాలిటిక్స్(రక్త రాజకీయం) కు తెరదీసింది. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైతుల రక్తం చవిచూస్తున్నారని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. సీఎంకు కావాలంటే తమ రక్తం ఇస్తామని, రైతులను ఆదుకోవాలని ఎక్స్ వేదికగా కామెంట్లు చేశారు. అనంతరం.. జూబ్లీహిల్స్‌లోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ విద్యార్థి, యువజన విభాగం కార్యకర్తలు రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో పలువురు విద్యార్థులు రక్తం దానం చేశారు. అనంతరం.. ఈ రక్తాన్ని సచివాలయానికి తీసుకువెళ్లి.. సీఎం రేవంత్ రెడ్డికి ఇచ్చి.. నిరసన తెలపాలని నిర్ణయించారు. ఈ క్రమంలో పోలీసులు బీఆర్ ఎస్ విద్యార్థి, యువజన విభాగం కార్యకర్తలను అడ్డుకుని రక్తం బాటిళు, ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇరు పక్షాల మధ్య తీవ్ర వాగ్యుద్ధం నడిచింది. అయినప్పటికీ.. పోలీసులు మరింత మందిని రంగంలోకి దింపి బీఆర్ఎస్ కార్యకర్తలను అడ్డుకున్నారు. ఇదిలావుంటే.. అసలు ఇంత రాజకీయం అవసరమా? అనేది పరిశీలకుల మాట. రైతులను ఆదుకునే విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా వెనుకబడే ఉందని పలువురు గుర్తు చేస్తున్నారు. రాజకీయం చేసేందుకు అనేక అంశాలు ఉన్నాయని రైతులకు నీటిని విడుదల చేయకపోతే.. ఆ మేరకు మరో మార్గం ఎంచుకోవాలని చెబుతున్నారు. ఇక, బీఆర్ఎస్ బ్లడ్ పాలిటిక్స్‌పై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. గతంలో బీఆర్ఎస్ పాలకులు రైతులకు సంకెళ్లు వేసి జైలుకు తరలించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం గమనార్హం.

## ఎన్టీఆర్ అభిమానుల్లో చీలిక.. 'రా ఎన్టీఆర్' వివాదంతో సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్!

తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ హీరోల అభిమానులు తమ అభిమానాన్ని వివిధ రూపాల్లో చాటుకుంటుంటారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడం, అభిమాన సంఘాలు ఏర్పాటు చేయడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం సాధారణమే. అయితే తాజాగా యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ పేరుతో ఏర్పడినట్లు ప్రచారం జరుగుతున్న 'రా ఎన్టీఆర్' సంస్థ వివాదం.. అభిమానుల మధ్యే విభేదాలకు దారితీసి సోషల్ మీడియాలో పెద్ద చర్చకు కారణమైంది. గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో 'రా ఎన్టీఆర్' పేరుతో ఒక సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, తిరుపతిలో భారీ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ హాజరవుతారని, వంద కోట్ల రూపాయలతో సేవా కార్యక్రమాలు చేపడతామని, అందుకోసం విరాళాలు కూడా సేకరిస్తున్నట్లు పలు పోస్టులు వైరల్ అయ్యాయి. దీంతో ఈ కార్యక్రమం ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశానికి సంబంధించినదా అనే ఊహాగానాలు కూడా మొదలయ్యాయి. ఈ ప్రచారం నేపథ్యంలో ఎన్టీఆర్ అధికారిక బృందం స్పష్టత ఇచ్చింది. విడుదల చేసిన ప్రకటనలో 'రా ఎన్టీఆర్' సంస్థకు తమతో ఎలాంటి సంబంధం లేదని, ఎన్టీఆర్ పేరు లేదా ఆయన ఫోటోలను అనుమతి లేకుండా ఉపయోగించవద్దని పేర్కొంది. అలాగే ఆ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రచారాలు లేదా ప్రకటనలకు ఎన్టీఆర్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. దీంతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి అధికారికంగా తెరపడింది. ఎన్టీఆర్ టీమ్ ప్రకటన తర్వాత అభిమానుల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఒక వర్గం అభిమానులు 'రా ఎన్టీఆర్' పేరుతో ఎన్టీఆర్ ఇమేజ్‌ను దెబ్బతీయొద్దని, ఆయన పేరుతో విరాళాలు సేకరించడం సరికాదని విమర్శిస్తున్నారు. మరోవైపు 'రా ఎన్టీఆర్' సంస్థ ప్రతినిధులు మాత్రం తాము గత ఏడేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తమ ఉద్దేశం కేవలం సేవ మాత్రమేనని చెబుతున్నారు. ఎన్టీఆర్‌పై తమకు అపారమైన గౌరవం ఉందని, ఆయన స్వయంగా ఆపమంటే వెంటనే అన్ని కార్యక్రమాలు నిలిపివేస్తామని కూడా వారు పేర్కొంటున్నారు. అయితే ఎన్టీఆర్ వ్యక్తిగత పీఆర్ టీమ్ అధికారికంగా ప్రకటన విడుదల చేసిన తర్వాత కూడా, "ఆ విషయాలు ఎన్టీఆర్‌కు తెలిసి ఉండకపోవచ్చు" అని 'రా ఎన్టీఆర్' సంస్థ స్పందించడం మరిన్ని సందేహాలకు తావిచ్చింది. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ వ్యవహారం సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్‌గా మారింది. ఒక వర్గం ఎన్టీఆర్ పేరును అనధికారికంగా వినియోగించడం సరికాదని వాదిస్తుండగా, మరో వర్గం సేవా కార్యక్రమాల ఉద్దేశాన్ని సమర్థిస్తోంది.



## 'ప్రభాస్ నుంచి దొంగిలించాల్సింది అదొక్కటే'

సినీ ప్రియుల గుండెల్లో బుట్టబొమ్మగా ముద్ర వేసుకున్న బ్యూటీ పూజా హేగ్డే. తెలుగులో స్టార్ హీరోల సరసన నటించింది. పలు సూపర్ హిట్ చిత్రాలను తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ నటించిన జన నాయగన్ రిలీజ్‌కు సిద్ధమైంది. ఈనెల 23 నుంచే థియేటర్లలోకి రానుంది. విజయ్ హీరోగా వస్తోన్న చివరి చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సంగతి పక్కనపెడితే బుట్టబొమ్మ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేసింది. రెబల్ స్టార్ ప్రభాస్ గురించి మాట్లాడింది. ఆయనతో రాధే శ్యామ్ మూవీలో హీరోయిన్‌గా చేశానని తెలిపింది. ఈ మూవీ షూటింగ్ టైమ్‌లో నాకు ప్రభాస్ పంపిన ఫుడ్ ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఆనందం వ్యక్తం చేసింది. ఆయన దగ్గర నుంచి తీసుకోవడానికి ఇంకేం లేదని.. అవకాశం వస్తే ఆయన కుక్‌ను దొంగిలిస్తానని ఫన్నీ కామెంట్స్ చేసింది బుట్టబొమ్మ. ఈ కామెంట్స్ నెట్టింట తెగ వైరలవుతున్నాయి.



## అఫిషియల్.. 'జననాయగన్' విడుదల తేదీ ఖరారు!



కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటిస్తున్న ఆఖరి చిత్రం విడుదల తేదీ ఎట్టకేలకు అధికారికంగా ఖరారైంది. ఎన్నో వాయిదాలు, సెన్సార్ వివాదాల తర్వాత ఈ చిత్రానికి 'జననాయగన్' (తెలుగులో 'జననాయకుడు', హిందీలో 'జన్ నేత') అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ ఈ నెల 23న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ ఖఎచీ ప్రొడక్షన్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. విజయ్ రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో ప్రవేశించి, సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వస్తున్న చివరి సినిమా కావడంతో దీనిపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. హెచ్. వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, బాబీ డియోల్, మమితా బైజు, ప్రకాష్ రాజ్, ప్రియమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సెన్సార్ బోర్డ్ (జదీఖీజ) ఇప్పటికే 'ఖా' సర్టిఫికేట్ జారీ చేసింది. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో జులై 23న విడుదల కాబోతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.



## 'పల్లీ చట్నీ' అనుకుంటే పప్పులో కాలేసినట్లే.. ఓటీటీలోకి వచ్చేస్తోన్న క్రేజీ యాక్షన్ డ్రామా 'పళ్లిచట్టంబి'!

'పళ్లిచట్టంబి'.. ఈ పేరు వినగానే తెలుగు ఆడియన్స్‌కు ముందుగా స్ట్రైక్ అయింది 'పల్లీ చట్నీ'. అవును, ఈ సినిమా టైటిల్ అనౌన్స్ చేసినప్పుడు తెలుగువాళ్లంతా ఇలాగే అవాక్కయ్యారు. ఏంటి.. తెలుగులో పెట్టడానికి నిర్మాతలకు ఇంతకంటే మంచి పేరు దొరకలేదా? అంటూ సోషల్ మీడియాలో మీమ్స్‌తో ఆటాడుకున్నారు. కానీ, కట్ చేస్తే.. కంటెంట్ ఉన్న సినిమాకి టైటిల్స్ అడ్డుకావని ఈ చిత్రం నిరూపించింది. కేరళ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పవర్‌ఫుల్ పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీ, బాక్సాఫీస్ వద్ద మోస్తరు విజయాన్ని అందుకొని విమర్శకుల ప్రశంసలు సైతం సొంతం చేసుకుంది. ఇక థియేటర్లలో ఈ టైటిల్ వెరైటీని చూసి మిస్ అయిన వారి కోసం ఈ చిత్రం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై వచ్చేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'సోనీ లివ్' లో జులై 24 నుండి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ఒకేసారి అందుబాటులోకి రాబోతోంది. సినిమా కథ విషయానికి వస్తే.. 1957 నాటి కేరళ భూసంస్కరణల బిల్లు నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది. చర్చి భూములను కాపాడటం కోసం 'పోతన్ క్రిస్టోఫర్' (టొవినో థామస్) అనే యువకుడిని చర్చి రక్షకుడిగా (చట్టంబి) నియమిస్తారు. అయితే, అతని అసలు పేరు కృష్ణ పిళ్లై. ఒక హిందూ యువకుడైన కృష్ణ పిళ్లై, మారుపేరుతో చర్చిలోకి ఎందుకు అడుగుపెట్టాడు? కమ్యూనిస్ట్ భావజాలం ఉన్న రెబెక్కా (కయాదు లోహర్)తో అతని ప్రేమాయణం ఎలా సాగింది? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాను దర్శకుడు డిజో జోస్ ఆంటోని తెరకెక్కించారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com